
అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్‌లో షాపుల ముందు తవ్వి వదిలేసిన రహదారి


నందగిరినగర్‌లో రోడ్డును ఆక్రమించి భవన నిర్మాణ పనులు


ఎన్జీజీవోస్ కాలనీలో రోడ్డుపై వేసిన ఇసుక కుప్ప

రహదారులు ఇలా.. రాకపోకలు ఎలా?


శ్రీనివాసనగర్‌లో ప్రధాన రహదారి దుస్థితి

సీతంపేట: జీవీఎంసీ 43, 44 వార్డుల్లో 24/7 తాగు నీటి సరఫరా కోసం జరుగుతున్న అమృత్ 2.0 పనులతో రహదారులను ఇష్టానుసారంగా తవ్వి వదిలేశారు. అబిద్‌నగర్ షాదీఖానా వద్ద నిర్మించిన భారీ వోవర్ హెడ్ ట్యాంక్ నుంచి వార్డుల్లోని ప్రతి ఇంటికి 24/7 నీటి సరఫరా కోసం ప్రధాన రహదారులతోపాటు అనుబంధ రహదారులను పైపులు వేయడానికి తవ్వారు. ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థల ముందు రోడ్లను తవ్వేయడంతో నెల రోజులుగా జనం ఇబ్బంది పడుతున్నారు. అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్, శ్రీనివాసనగర్, నందగిరినగర్, నరేంద్రనగర్, వెంకటేశ్వర కాలనీ, జగన్నాథపురం, సంఘం ఆఫీస్, గోళీలపాలెం, యలమంచిలి వారి వీధి తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. తవ్విన మట్టిని అలాగే వదిలేయడం, తీసిన గోతులను కాంక్రీట్‌తో పూడ్చక పోవడంతో ఇళ్లు, దుకాణాల ముందు మట్టి కుప్పలుగా ఉండటంతో వాహనాల పార్కింగ్‌కు, రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారులు చిత్తడిగా మారాయి. వీలైనంత త్వరగా పైప్‌లైన్ పనులు పూర్తి చేసి, తవ్విన రోడ్లను కాంక్రీట్ పూడ్చి పూర్వ స్థితికి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారులపై నిర్మాణ సామగ్రి

ఒకవైపు అభివృద్ధి పనుల నిమిత్తం రహదారులు తవ్వేయగా.. మరో వైపు ఆయా రహదారుల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులు మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అక్కయ్యపాలెం, నందగిరినగర్, ఎన్జీజీవోస్ కాలనీ, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో భవన నిర్మాణ పనులు పెద్ద ఎత్తున చేపడుతున్నారు. భవన నిర్మాణాలకు తెచ్చిన ఇసుక, పిక్క, ఇటుక వంటి సామగ్రిని రోడ్డు పైన కుప్పలుగా పడవేస్తున్నారు. దీంతో ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. మరికొంత మంది భవన నిర్మాణానికి అవసరమైన కాంక్రీట్ పనులు రోడ్డును ఆక్రమించి నిర్వహిస్తున్నారు. దీంతో ఆటోలు, కార్లు సైతం ప్రయాణించడానికి వీలు లేకుండా పోతోందని, అత్యవసర సమయాల్లో అంబులెన్స్, ఆటో వంటి వాహనాలు కూడా రావడానికి వీలులేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు నిర్మిస్తున్న భవన యజమానులు రహదారులను ఇష్టానుసారంగా ఆక్రమించి పనులు చేపడుతున్నా.. టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ సామగ్రితో రహదారులను ఆక్రమించి పనులు చేపడుతున్న భవన యజమానులను స్థానికులు ప్రశ్నిస్తే.. ఇంటి నిర్మాణానికి ప్లాన్ తీసుకున్నామని చెబుతున్నారని, ప్లాన్ తీసుకుంటే రహదారులను ఇష్టానుసారంగా ఆక్రమించి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించవచ్చా అని పలువురు మండిపడుతున్నారు. భవన నిర్మాణ సామగ్రి, నిర్మాణ పనులతో రహదారులను ఆక్రమిస్తున్న వారిపై సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- 43, 44 వార్డుల్లో ఇష్టానుసారంగా తవ్వి వదిలేసిన రోడ్లు
- అస్తవ్యస్తంగా 24/7 నీటి సరఫరా పనులు
- భవన నిర్మాణ సామగ్రితో రోడ్ల ఆక్రమణ
- స్థానికులు, వాహనాల చోదకుల తంటాలు
- ఇబ్బందులు తొలగించాలని విజ్ఞప్తి

నెల రోజులుగా అవస్థలు

నీటి సరఫరా పనుల నిమిత్తం పైపులు వేయడానికి అన్ని ప్రాంతాల్లో రహదారులను తవ్వి వదిలేశారు. ఇళ్ల ముందు, దుకాణాల ముందు తవ్వేయడంతో నెల రోజులుగా అవస్థలు పడుతున్నాం. ఇంటి వద్ద వాహనాలు పార్క్ చేయడానికి, తియ్యడానికి ఇబ్బందిగా ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. అధికారులు స్పందించి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి రహదారులను పూర్వ స్థితికి తీసుకురావాలి.

– జి.తాతారావు, శ్రీనివాసనగర్

రోడ్లు ఆక్రమించి పనులు

భవన నిర్మాణ పనుల కోసం కొంతమంది రహదారులను తమ సొంత జాగీరులా వాడుకుంటున్నారు. ఇసుక, పిక్క, ఇటుకలు రోడ్ల మీద పెద్ద కుప్పలుగా డంప్ చేస్తున్నారు. కాంక్రీట్ మిషన్ రోడ్డుపై అడ్డుగా పెట్టి రాకపోకలకు వీలులేకుండా పనులు చేస్తున్నారు. ఇదేంటని అడిగితే ప్లాన్ తీసుకున్నామని చెబుతున్నారు. అత్యవసర సమయాల్లో సైతం రాకపోకలకు వీలు లేకుండా రోడ్లు ఆక్రమించి పనులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– బి.శ్రీనివాసరావు, నందగిరినగర్


వెంకటేశ్వర కాలనీ రోడ్డుపై మట్టి కుప్పలు


80 ఫీట్ రోడ్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు

క్లుప్తంగా

41 ఏళ్ల పాటు ఉపాధ్యాయినిగా సేవలు


ఆకెళ్ల రమణిశ్రీని సత్కరిస్తున్న ఎంఈవోలు రామారావు, బాలామణి, ఉపాధ్యాయ సిబ్బంది

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయురాలు ఆకెళ్ల రమణిశ్రీ సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. సీతమ్మధార మండలం ఎంఈవోలు రామారావు, బాలామణి, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల పేరెంట్ కమిటీ సభ్యులు రమణిని సన్మానించారు. ఈ సందర్భంగా రాధాకుమారి మాట్లాడుతూ ఆకెళ్ల రమణిశ్రీ 41 ఏళ్ల పాటు సుదీర్ఘంగా ఉపాధ్యాయినిగా సేవలందించి, ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం అందుకున్నారని, ఇటీవల జరిగిన పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారన్నారు.

వెంగళరావు సేవలు మరువలేనివి


వెంగళరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

తాటిచెట్లపాలెం: మాజీ కార్పొరేటర్ కొల్లాబత్తుల వెంగళరావు సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. వెంగళరావు 57వ జయంతి సందర్భంగా సోమవారం 104 ఏరియాలోని నివాసంలో ఆయన చిత్రపటానికి రెయ్యి వెంకటరమణ పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. అనంతరం వెంగళరావు కార్పొరేటర్‌గా పనిచేసిన 47, 48 వార్డుల పారిశుధ్య సిబ్బందికి అన్నదానం చేశారు.

కుటుంబ సభ్యుల చెంతకు అదృశ్యమైన మహిళ


భార్య నీలవతిని భర్త వర్మకు అప్పగిస్తున్న ఫోర్త్ టౌన్ పోలీసులు

తాటిచెట్లపాలెం: భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మహిళను ఫోర్త్ టౌన్ పోలీసులు వెతికి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సాలగ్రామపురం, ఇనార్బిట్ మాల్ వెనుక ప్రాంతం సింహగిరి కాలనీకి చెందిన గరికిన నీలవతి భర్త వర్మ, ఇద్దరు పిల్లలతో కలిసి రెండేళ్లుగా అద్దె ఇంట్లో నివసిస్తోంది. ఈమె జూన్ 25న భర్తతో గొడవపడి ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. భర్త కుటుంబ సభ్యులు 28వ తేదీన ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు నీలవతిని వెతికి, సోమవారం ఆమె భర్త, బంధువులకు అప్పగించారు.

ఘనంగా ప్రైడ్ మంత్ వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

సీతంపేట: నెస్సమ్ ఆర్గనైజేషన్, ఆస్తిత్వం ఫౌండేషన్, వైఆర్‌జీ కేర్ సంయుక్తంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం ప్రైడ్ మంత్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళా ప్రదర్శనలు, ఈవినింగ్ షాడోస్ చిత్రం ప్రదర్శించారు. అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన ఈ చిత్రానికి శ్రీధర్ రంగయన్ దర్శకత్వం వహించగా.. సాగర్ గుప్తా కథ రచించారు. ఈ చిత్రం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కార్యక్రమంలో ప్రొఫెసర్ గంగిశెట్టి పద్దయ్య, జిల్లా ఎయిడ్స్ నివారణ యూనిట్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, గ్రీన్ ఫౌండేషన్ చైర్మన్ గీతా నారాయణ్, వైఆర్‌జీ కేర్ కో ఆర్డినేటర్ సుబ్బలక్ష్మి, కెన్ ఫౌండేషన్ సంతోష్, నెస్సమ్ ఫౌండేషన్ బాయపాటి విష్ణుతేజ పాల్గొన్నారు.

పైల దివాకర్‌కు కె.కె.రాజు నివాళి

తాటిచెట్లపాలెం: సీనియర్ జర్నలిస్ట్, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా కార్యాలయం పీఆర్‌వో పైల దివాకర్ ఆదివారం అనారోగ్యంతో మరణించారు. తాటిచెట్లపాలెంలోని ఆయన నివాసం వద్ద దివాకర్ పార్థీవ దేహాన్ని సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు సందర్శించి నివాళులర్పించారు. పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు బొల్లవరపు జాన్‌వెస్లీ, పేర్ల విజయ్‌చందర్, నాయకులు పి.వి.ఎస్.ఎస్.రాజు(వుడా రవి), అల్లంపల్లి రాజబాబు, ద్రోణంరాజు శ్రీవత్సవ్, కార్పొరేటర్లు పి.వి.సురేష్, కె.వి.ఎన్.శశికళ, జిల్లా అధికార ప్రతినిధి పళ్ల దుర్గ, జిల్లా అనుబంధ విభాగ నాయకులు మారుతీ ప్రసాద్, బొండా ఉమామహేశ్వరరావు, రాయపురెడ్డి అనిల్‌కుమార్, శ్రీదేవివర్మ, రాధ, పార్టీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, పలువురు పార్టీ నాయకులు, జర్నలిస్టు నాయకులు, జర్నలిస్టులు, స్థానికులు పాల్గొన్నారు.


పైల దివాకర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కె.కె.రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు

దివాకర్ అంత్యక్రియల్లో జర్నలిస్టులు

పైల దివాకర్ అంత్యక్రియల్లో ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు పాల్గొని అంతిమ వీడ్కోలు పలికారు. ఎంతో ఆప్యాయంగా పలకరించే తమ సహ జర్నలిస్టు దివాకర్ ఇకలేడని తెలిసి ఆవేదనకు గురయ్యారు.

భూసర్వే నివేదిక కోసం ఆందోళన

విశాఖ విద్య: జీవీఎంసీ 49వ వార్డు కప్పరాడ గ్రామం సర్వే నెం:13/ఏ లో బర్మా కాందిశీకుల ఇళ్ల స్థలాలకు సంబంధించిన సర్వే రిపోర్టు ఇవ్వాలని కోరుతూ బాధిత లబ్ధిదారులు సోమవారం గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బర్మా కాందిశీకులు పునరావాస సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారాయణ రావు మాట్లాడుతూ బర్మా కాందిశీకులకు పునరావాసాల ఏర్పాటు చేయడం కోసం కప్పరాడ గ్రామంలో సర్వే నెంబర్ 13/ఏ లో 9 ఎకరాల 50 సెంట్లు కలెక్టర్ పేరు మీద ప్రభుత్వం తీసుకుందన్నారు. ఆ భూమి నేటికీ బర్మా కాందిశీకుల్లో నిజమైన లబ్ధిదారులకు చెందలేదన్నారు. రెవెన్యూ రికార్డుల్లో పొందుపరచలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయమై స్పందనలో పలు సార్లు అర్జీలు పెట్టినా, ఆర్టీఐ చట్టం ద్వారా సమాచారం అడిగినా రెవెన్యూ అధికారులు పొంతన లేని సమాచారం అందిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. 18 ఏళ్లుగా స్థలాల కోసం పోరాడుతున్నామని, ఎమ్మెల్యే కూడా మాకు న్యాయం చేయట్లేదని విమర్శించారు. దళితులమనే చిన్న చూపుతో న్యాయం చేయకపోగా మాపై కేసులు పెట్టి కోర్టు చుట్టూ తిరిగేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద ఉన్న రికార్డులు చూపిస్తే అవి తప్పుడు రికార్డులు అంటున్నారని వాపోయారు. 2024లో రెవెన్యూ, దేవస్థానం ఆధ్వర్యంలో ఉమ్మడి సర్వే చేశారని, ఆ సర్వే రిపోర్ట్ ఇవ్వాలని కోరితూ దాట వేత ధోరణి అవలంబిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు అక్కడికి చేరుకొని బర్మా కాందిశీకులకు సర్దిచెప్పి అక్కడ నుంచి పంపించారు.


తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

పెన్షన్ భిక్ష కాదు.. హక్కు

తాటిచెట్లపాలెం: పెన్షన్ భిక్ష కాదని.. అది ఉద్యోగుల హక్కని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్‌ల ప్రతినిధులు పేర్కొన్నారు. రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్(ఆర్పీఏ), రైల్వే పెన్షనర్స్ ఫెడరేషన్(ఆర్పీఎఫ్), రిటైర్డ్ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్(ఆర్‌ఆర్‌ఈఏ), లోకో పైలట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో సోమవారం దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం చుట్టూ పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ సవరణ క్లాజ్ పేరుతో 2025–26 బడ్జెట్‌లో బిల్లును పాస్ చేసి, రాష్ట్రపతి ఆమోద ముద్రతో దాన్ని చట్టంగా చేశారని, దీని ప్రకారం ఇంతవరకు ఉద్యోగి హక్కుగా ఉన్న పెన్షన్‌ను కాలరాస్తూ, ప్రభుత్వ దయాదాక్షిణ్యంగాను, భిక్షగాను మార్చేసిందని ఆరోపించారు. పెన్షన్ ఉద్యోగి హక్కని సుప్రీం కోర్టు కూడా తెలియజేసిందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని, చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయంలో మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.కొండలరావు, కార్యదర్శి వేగి నాగేశ్వరరావు, రైల్వే పెన్షనర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎంఆర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కె.వి.నరసింగరావు, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వి.శేషాద్రి, కార్యదర్శి వేదుల నరసింగరావు, రైల్వే లోకో పైలట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.వి.రమణ, కార్యదర్శి కె.కె.రావు, అధిక సంఖ్యలో ఆయా యూనియన్‌లకు చెందిన సభ్యులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.


డీఆర్‌ఎం కార్యాలయం వద్ద మానవ హారం నిర్వహిస్తున్న రైల్వే పెన్షనర్లు

వారాహి అమ్మవారికి విశేష పూజలు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో వారాహి నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ నెల 26న ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా జరిపిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం తెల్లవారుజామున అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. సాయంత్రం పండితులు అమ్మవారికి సహస్రనామార్చన, చతుర్వేద స్వస్తి జరిపారు. అనంతరం పీఠం అర్చకులు అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తిలకించారు. వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


వారాహి అమ్మవారికి కుంకుమ పూజ చేస్తున్న అర్చకులు

రైల్వేస్టేషన్‌లో 11 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో సోమవారం రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సోమవారం జీఆర్పీ ఎస్‌ఐ శాంతారం, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ ఎస్.చిట్టిబాబు, సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. రాజస్థాన్ అళ్వార్ జిల్లాకు చెందిన కుషిరామ్ విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.55 వేల విలువైన 11 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

గరిమ సాంస్కృతిక సంస్థ సేవలు ప్రశంసనీయం

సీతంపేట: గరిమ సాంస్కృతిక సంస్థ పుష్కరోత్సవ ప్రారంభ సభ సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. గరిమ వ్యవస్థాపకుడు కోడుగంటి నరసింహం సంస్థ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కవి సి.హెచ్.చినసూర్యనారాయణ అధ్యక్షతన జరిగి సభలో కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు మాట్లాడుతూ గరిమ సాంస్కృతిక సంస్థ భవిష్యత్‌లో మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రధాన వక్త డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ తెలుగు నవల ఆవిర్భావ వికాసాలను వివరించారు. నవల సామాజిక దృక్పథం అనే అంశంపై ప్రసంగిస్తూ వీరేశలింగం నుంచి నేటి వరకు వివిధ కాలాల్లో పలు పరిణామాలు నవలా రచయితలను ప్రభావితం చేశాయన్నారు. మాలపల్లి, వేయి పడగలు, చదువు, రాజు మనిషి, ఖాకీ వనం నవలల్లోని సామాజిక కోణాన్ని పరిచయం చేశారు. కార్యక్రమంలో ఎస్.హనుమంతరావు, కె.వి.ఎస్.మూర్తి, బసుపోతన, దామరాజు విశాలాక్షి, బాలబాట రమణమ్మ, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పుష్కరోత్సవంలో ప్రసంగిస్తున్న రచయిత సూర్యారావు

గాంధేయవాది రావిప్రోలు

సీతంపేట: స్థానిక బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సోమవారం గాంధేయవాది డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథి గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ రావిప్రోలు చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావిప్రోలు గొప్ప గాంధేయవాదని, 75 ఏళ్ల వయసులో గాంధీజీపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, డి.వి.సూర్యారావు, మేడా మస్తాన్‌రెడ్డి, ద్విభాష్యం రాజేశ్వరరావు, కె.వి.ఎస్.మూర్తి, సిహెచ్.చినసూర్యనారాయణ పాల్గొన్నారు.


రావిప్రోలుకు నివాళులర్పిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు